నమస్కారాలు.

మీ అమూల్యమైన కాలంలో నాకోసం కొంత సమయాన్ని కేటాయిస్తున్నందుకు కృతజ్ఞతలు. మృత్యు దేవత రాకకై వాకిట్లో ఎదురుచూస్తున్న నేను, నా జీవన అనుభవాల్లోని 'చేదు' నిజాల్ని మీముందు వుంచుతాను. నా జీవితంలా మరెవరిదీ కాకూడదని ఈ ప్రయత్నం.

# తరాల అంతరాలు

ఆకెళ్ళ శివప్రసాద్



గోదావరి తీరాన వున్న చిన్న పల్లె మావూరు. పచ్చని పంటల పొలాలతో. సమృద్ధిగా వున్న పాడితో కళకళలా డుతూ వుండేది మావూరు. అందులో మాయిల్లు ఎప్పు డూ పెళ్ళివాళ్ళతో నిత్యం పండగే.

మా నాన్నగారి వాళ్ళది పెద్ద కుటుంబం. నలుగురు అన్నదమ్ములు. ముగ్గురు అక్కచెల్లెళ్ళు. నాకు జ్ఞానం వచ్చేసరికి ముగ్గురు అత్తయ్యలకి పెళ్ళిళ్ళయిపో యాయి. వాళ్ళు చుట్టు పక్కలవూర్లలో వుండడంచేత తరచు వస్తూ వెళ్తుండేవాళ్ళు. పండగొచ్చినా, పబ్బమొ చ్చినా రెండు రోజుల ముందునుండి వరసగా ఎడ్ల బండ్లో గుర్రబండ్లో వస్తూనే వుండేవి. మా నాన్నగారు రెండో సంతానం. బాబాయ్యిల పెళ్ళిళ్ళయి, వుద్యోగాలు వచ్చేంతవరకు మా వూళ్ళోనే వుండేవాళ్ళు. వుద్యోగాలు వచ్చాక దగ్గర్లో వున్న పట్నంలో వుంటున్నారు. మా పెదనాన్నగారి పిల్లలు, బాబాయ్‌గారి పిల్లలు, అత్త య్యల పిల్లలు సుమారు నలభైమంది దాకా వుండేవా ళ్ళం. రోజూ భోజనాల దగ్గర 'సంతర్పణ'లా వుండేది. పిల్లలమయిన మాకయితే సమయం తెలిసేది కాదు.. కోతి కొమ్మచ్చే, చెడుగుడే, ఐస్‌బాయో.. ఏదో ఆట.. కాలం తెలీకుండా జరిగిపోయేది..

దేవీ నవరాత్రులు ఎంత ఆనందంగా గడిచిపోయే వని.. కొన్ని అనుభవాల్ని అక్షరాల్లో చిత్రించడం కష్టం... ఆ తొమ్మిది రోజులు నాకే కాదు, నా ఈడు కుర్రకారు ఎవరికి కంటి మీద నిద్ర ఉంటే ఒట్టు. అప్పటిదాకా అన్ని ఉత్సవాల్లో పెద్దవాళ్ళు ఆజమాయిషీ చెలాయిస్తే... ఈ పండుగరోజులు మావి.. మేమే సంస్కృతం పాఠశాల ఆవరణలో పందిరులు వేసేవాళ్ళయం... మామిడి తోర ణాలు కట్టేవాళ్ళం.. ఆవూళ్ళో ఎవరి పెరట్లో వున్నా అన్ని రకాల పూలు.. చామంతులు, సంపెంగలు, మందారాలు, నిత్యమల్లెలు అన్నీ కోసుకువచ్చి అందంగా 'దేవీ' మందిరాన్ని అలంకరించేవాళ్ళం.. పగలంతా పూజలతో, రాత్రి భజనలతో, బుర్రకథల్తో, హరికథల్తో, నాటకాలతో గడిచిపోయేవి.. ప్రసాదాలతోనే కడుపు నింపుకొనేవాళ్ళం...

ఆ ఏడాది నవరాత్రి ఉత్సవాలకి ఎప్పటిలాగే పట్నంలో వుండే బాబాయ్‌లు, పిన్నిలు, పిల్లలు వచ్చా రు. బాబాయ్‌వాళ్ళు ఎందుకో ఆనందంగా కన్పించలే దు... మొదటి రోజు ప్రయాణపు బడలిక అనుకున్నామే కానీ... ఆ మర్నాడు... మూడోనాడు కూడా మార్పు లేదు.. అయినా బాబాయ్‌లు, పిన్నిలు ఎలావుంటే నాకే మిటి?.... వాళ్ళ పిల్లలు, మేము ఎప్పటిలాగే కలిసిపో యేము... నవరాత్రులు వైభవంగా ముగిశాయి!

దసరా అయిన మర్నాడు భోజనాలు అయినాకా, చిన్న బాబాయ్ అన్నాడు...

"... మా వుద్యోగాలకి ఎలాగూ ఈ వూళ్ళో వుండే అవకాశం లేదు.. అంచేత వీలైనంత త్వరలో 'వాటాలు' పంచండి..." అన్నాడు పెదనాన్నగారివైపు చూస్తూ.

"...వాటాల అవసరం ఏముందిరా?... మీరు ఎక్కడు న్నా ఏడాది తిరిగేసరికి మీ వంతు డబ్బూ, సరుకులు వస్తూనే వున్నాయిగా..." సముదాయిస్తున్నట్లు అన్నారు పెదనాన్నగారు.

"...ఇవ్వాల్లేదనికాదు.. పొలం నాకిష్టం లేదు... అమ్మే యాలనుకుంటున్నాను..." అన్నాడు బాబాయ్.

"..అంత అమ్మవలసిన అవసరమేమొచ్చిందిరా.. నీకు ఎంత డబ్బు అవసరం?... శాంతంగా అడిగారు.

"...అవసరమని తీసుకున్నా... అప్పుగా తీర్చుకోవా



"నన్ను పెళ్ళి చేసుకుంటే నీ కష్ట సుఖాల్లో పాలుపంచుకొంటా గోపీ".

"నాకు కష్టాలంటూ ఏంలేవు రాథ"

"నేను చెప్పేది ఇప్పటి సంగతి కాదు మన పెళ్ళయిన తర్వాత సంగతి"

ఆ...

బి.ఆదిలక్ష్మి, చీరివాడ

లిగా... నాకు అప్పువద్దు.. నా వాటా నాకు ఇచ్చేస్తే నా యిష్టం వచ్చినట్టు చేసుకుంటాను.." ఖండితంగా చె ప్పాడు.

మూడో బాబాయ్, పిన్నీ చివరి బాబాయ్‌కు సపోర్టు చేశారు.

...ఆ రోజు అంటూ మాటలు సాగుతూనే వున్నాయి. ...ప్రశాంత' వాతావరణంలో మొదలయిన'చర్చ' యు ద్ధ వాతావరణానికి దారి తీసింది.. ఆ రాత్రి.. అరుపులు, కేకలతో ఎవరికి నిద్రలేదు. ఆ మర్నాడే-

పొలమేకాకుండా, యింట్లో గదులు, సామాన్లతో సహా పంపకాలు అయిపోయాయి. ఆ తరువాత ఏ పండుగొ చ్చినా బాబాయ్‌వాళ్ళు రాలేదు. వాళ్ళుంటున్న పట్నం కేవలం పాతిక కిలోమీటర్లే అయినా మనసులు వేల యోజనాల దూరంలో ఉన్నట్లుగా మారిపోయాయి.

నేను కాలేజీలో వున్నప్పుడు పెదనాన్నగారు 'కాలం' చేశారు. మా దొడ్డమ్మ పిల్లల్నితీసుకుని వాళ్ళ పుట్టింటికి వెళ్ళిపోయింది. మొదట్లో కేవలం కాస్త 'మనశ్శాంతి' కోసం వెళ్తున్నానని చెప్పినా మళ్ళీ మా వూరు వైపు చూళ్ళేదు!

కాలం మాయాజాలంలో 'నాన్న తరం' కరిగిపో యింది. నా తరం వచ్చింది. అప్పటికి నా 'వంతు' పొలం కౌల చేతుల్లో వుంది. పట్నంలో వుద్యోగం చేస్తున్న నేను వాళ్ళతో ఇబ్బందులు పడలేక వున్న కాస్త పొలాన్ని అమ్మేశాను. భూమిని అమ్మిన నెల రోజుల వరకు 'షాక్‌'లో వున్నట్లుగా వుండిపోయాను... ఎన్నో తరాల నుండి అన్నం పెడుతున్న భూమి అది... మా పూర్వుల్లో ఒక ఘనపాఠి గారి వేద పాండిత్యానికి మెచ్చుకుని ఎవరో 'రాజు'లు రాసిచ్చిన భూమి అది.. నా చేతుల మీదుగా అమ్మిన రోజు.. ఆ నేల తల్లిని వదిలి పెట్టలేక, ఈ నేలలో ఈ చేతులతో చిన్నతనంలో మురిపెంగా నాటిన మొక్క లు మహావృక్షాలై ప్రాణ స్నేహితుల్లా పిలపిస్తున్నట్టు అన్పించింది. నీల కన్నీళ్ళతో కంపించింది!

నా 'తరం'లో నేను చిన్న గుమాస్తాగానే వుండిపో యినా మా పిల్లలు యిద్దరూ రత్నాలు... చిన్నప్పటి నుండి ఎంత శ్రద్ధగా చదివే వాళ్ళని... చదువుల తల్లి వాళ్ళ కృషిని ఆశీర్వదించి కటాక్షించింది... అబ్బాయి ఇంజనీరు... అమ్మాయి డాక్టర్... అమ్మాయి డాక్టర్ చదువు పూర్తయిన వెంటనే మా బంధువుల ద్వారా వచ్చిన సంబంధం కుదిరింది... ఏ మాత్రం శ్రమ అన్పించలేదు ఆడపిల్ల పెళ్ళయినా... అల్లుడూ, కూతు రు అమెరికా వెళ్ళిపోతుంటే మరో 'బంధం' అందనంత దూరానికి వెళ్ళిపోతున్నట్టు గుండెలో కలుక్కుమంది.

అబ్బాయి శేఖర్‌కి నాలుగేళ్ళ నాడు వివాహం అయ్యింది. తన కంపెనీలోనే వుద్యోగం చేస్తున్న 'సుజా త'ని పెళ్ళి చేసుకుంటానంటే, యిష్టపడిన సంబంధం అని మా ఆనందాన్ని అంగీకారాన్ని తెలిపాము... మన సులు కలిసిన వాళ్ళు వాళ్ళు.... వాళ్ళ కిద్దరికి అంగీకార మైతే మాకభ్యంతరం ఏమిటి?... కాలేశ్వం ముందుకు పరుగులు తీసింది... ఆఫీస్ క్యాంప్ నుండి యింటికి వచ్చేసరికి కొడుకు, కోడలు కన్పించలేదు. "... మనవన్నీ పాత పద్ధతులట... నా వంట బాగోదట... పనులు బాగోవట.... ఆ రోజు పెళ్ళంటే కుటుంబం, మంచీచెడు విచారిద్దామంటే విన్నారా?.... సుమా.... వాళ్ళిద్దరికీ 'యిష్టం'గా వున్నప్పుడు మనకేమిటి అన్నారు ?.. వీడు... నిన్న మొన్నటి దాకా 'అమ్మా అమ్మా' అంటూ వెనకే తిరిగేవాడు... పెళ్ళామొచ్చేసరికి కొమ్ములొచ్చాయి..." ఆ రోజంతా కొడుకుని, కోడల్ని తిడ్తూనే వుంది మా ఆవిడ. శేఖర్ పెళ్ళయినాకా చిన్న చిన్న గొడవలు వచ్చినా మానుండి 'దూరం'గా వెళ్ళిపోతారని ఎన్నడూ వూహించలేదు.

చినికి చినికి గాలివాన అయ్యింది.

కొడుకూ, కోడలూ లేని యిల్లు 'బోసి'గా అన్పించినా, రెండు మూడు రోజులకి కాస్త 'అలవాటు' అయి, 'ఎక్కడుంటే ఏముంది?' సుఖంగా వుంటే చాలనుకు న్నాను. శేఖర్ కనీసం ఫోన్ కూడా చేయకపోయినా, నేనే వాడి ఆఫీసుకి వెళ్ళాను. నాతో మాట్లాడినంత సేపు ఇబ్బందిగా ఏదో 'అపరిచిత' వ్యక్తితో ప్రవర్తించినట్లు ప్రవర్తించాడు.

హే భగవాన్!.... కొడుక్కి తండ్రి అపరిచితుడా? సుజాతని చూద్దామని అడిగితే, ఆ రోజు ఆమె ఆఫీసుకి రాలేదని జవాబు వచ్చింది.

ఆ తరువాత వాడి ఆఫీసుకి వెళ్ళి, వాడ్ని 'బాధ' పెట్టడం యిష్టం లేక, తరుచు ఫోన్ చేస్తూ 'క్షేమ సమాచారం' కనుక్కుంటున్నాను..!

కాలం ఎవరికి అందకుండా సాగిపోతూనే వుంది.... ఎవరో 'సజావు'గా వుండడం కాలానికి యిష్టం లేదేమో...? లేకపోతే ఏమిటీ?... నేను విన్నది నిజ మేనా?... అబద్ధం అయితే ఎంత బాగుణ్ణు... రంపపు కోత కోసినట్టుగా వుంది గుండె... బ్యాంకుకి పెన్షన్ తీసుకుందామని వెళ్ళాను... డబ్బులు తీసుకొని వస్తుంటే...

"... నమస్కారం సార్..." అన్న మాట విన్పించింది. 'ఎవరు?' చప్పున గుర్తు రాలేదు.

"నేనండి... నటరాజుని... మీ శేఖర్ ఫ్రెండ్‌ని..." అంటూ నమస్కరించాడు. కుశల ప్రశ్నలు అయ్యాయి. తరువాత మెల్లగా..

"...మీ కుటుంబ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటు న్నాననుకోకపోతే... ఓ విషయమండి... శేఖర్ బాగా 'డీలా' అయిపోయాడు... మీరు సుజాత గారితో ఈ విషయమై మాట్లాడితే బాగుంటుంది..." అన్నాడు బాధ పడ్తూనే.

విషయం అర్థం కాలేదు. శేఖర్ డీలా అవడం ఏమిటి? నా చిట్టి తండ్రికి ఏమయ్యింది? నాకు శేఖర్ విషయాలు తెలిసేసరికి ఆశ్చర్యపోయి, విషయం చెప్ప

న్నాను...

"... సంసారమన్నాక ఏవో గొడవలు వస్తూనే వుంటాయండి..." అంటూ చెప్పుకుపోయాడు. 'పిల్లల్ని కనడం' విషయంలో శేఖర్‌కి, సుజాతకి అభిప్రాయ భేదాలు వచ్చాయట. అది 'పెద్ద గొడవ'గా పరిణమించింది. చివరికి నువ్వు లేకపోయినా, నేను బ్రతగ్గలను' అందిట సుజాత. అనడమే కాదు సుజాత యిప్పుడు విడిగా వుంటోందిట. నా తల తిరిగిపోయింది. కొడుకు, కోడలు మధ్య గొడవలు 'విడి'పోయే వరకు వచ్చినా, ఈ వూళ్ళో వుంటున్న నాకు తెలీలేదు... కళ్ళలో కుంభవృష్టి!... బ్యాంకు నుండి డైరెక్ట్‌గా శేఖర్ ఆఫీస్‌కి వెళ్ళాను... రిసెప్షనిస్టు నుండి -

'ఆయన లీవ్‌లో వున్నారటండి.. ఏ వూరు వెళ్ళారో తెలీదట..'' అని జవాబు వచ్చింది. మేముండగా ఎక్కడికో ఎందుకు వెళ్ళినట్టో అర్థం కాలేదు.... 'వేరే'గా వెళ్ళిపోయినప్పటి నుండి 'సంబంధాలు' తెగిపోయాయనుకున్నాడా?... ఇంత సులువుగా బంధాలు తెంచుకొనే కొడుకులు వున్నారా?

సుజాతని పిలవమన్నాను. రెండి నిముషాలకి వచ్చింది.

"...ఇది ఏమిటమ్మా... నేను విన్నది నిజమేనా..." నా మాట పూర్తికాకుండానే...



"ఇంట్లో దోసె తినడానికి, హొటల్లో దోసె తినడానికి ముందు వెనుక చిన్న తేడా మాత్రమే..."

ఇంట్లో పళ్ళు రుబ్బేసి దోసె తింటాను. హొటల్లో దోసె తిన్న తర్వాత పళ్ళు రుబ్బుతాను.

**- పొనగంటి రవీందర్, ముస్తాబాద్**

"....ఇదేమిటో... మీ అబ్బాయినే అడగండి..." అని రిసెప్షనిస్టు వైపు తిరిగి....

"...ఎవరో వచ్చి పిలవమంటే పిలవడమేనా?.. పేరు కనుక్కోవద్దు?... టైమ్ వేస్ట్..." అంటూ రుసరుస వెళ్ళిపోయింది. 'టైమ్ వేస్టా?' గుండెల్ని పిండేసిందా మాట.

కావలసిన వాళ్ళు వస్తే వేస్టా? తెగిపోయిన బంధాలకి ప్రతీకలా ఆ మాటలు?

మానవ జీవన సంబంధాల ఆంతర్యం ఇదేనా?

జరిగిన కాలాన్ని తల్చుకుంటే గుండె బరువెక్కిపోతోంది....

చిన్నతనంలో...
ఉమ్మడి కుటుంబం....
నా తరంలో...
మా కుటుంబం....
శేఖర్ తరంలో....
కుటుంబమే లేదు... ఎవరికి, వారేనా?

మనుష్యులు సహజ గుణాల్ని పూర్తిగా మర్చిపోయి, ఎవరికి వాళ్ళు విడివిడిగా అయిపోతూ, బంధాలకి, అనుబంధాలకి ఎలా దూరంగా వుంటున్నారో అర్థం కావడం లేదు...

ఈ యాంత్రిక ప్రపంచంలో, ప్రేమకి, ఆత్మీయతకి అర్థం వుందా...?

నాకు అర్థం కావడం లేదు....

ప్లీజ్... దయచేసి మీకు తెలిస్తే చెప్పరూ?

## జంబూ నేరేడు

**ఇం**గ్లీషులో 'ఏపిల్ రోజ్' గానూ, వృక్ష శాస్త్రంలో 'యూజెనియా జవానికా' గానూ, హిందీలో 'గులాబీజామున్'గానూ వ్యవహృతమవుతుంది ఆ పండు. తెలుగులో దాన్ని 'జంబూ నేరేడు' అంటారు.

నిజానికిది ఆపిల్‌లా కాని, నేరేడుపండులా కాని ఉండదు. జంబూ నేరేడు పండు చిన్నదిగా గుండ్రంగా 5 సెంటీమీటర్ల సైజులో 40 గ్రాముల బరువు ఉంటుంది.

పండు పై భాగం తెలుపు కలగసిన క్రీమ్ రంగులో ఉంటుంది. పండు పై భాగం తినవచ్చు. తియ్యగా ఉంటుంది.

లవంగం, పండిన ఇప్పపువ్వు వాసన వచ్చే ఈ పండులోపల ఒకటి రెండు గింజలు బూడిద రంగులో ఉంటాయి. వాటిని తినకూడదు. జంబూనేరేడు 6-10 మీటర్ల ఎత్తు పెరుగుతుంది.

మొదట్లో ఇది మలయాకు చెందిన చెట్టు. తర్వాత మన దేశంలోకి ప్రవేశించింది.

ఈ పండు చూడడానికి చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. జంబూ నేరేడు పండులో విటమిన్లు ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి.

దక్షిణ భారతదేశంలో ఈ చెట్లు అక్కడక్కడ కనిపిస్తాయి.

కాని వీటి ధర సామాన్యునికి అందుబాటులో ఉండదు. మన దేశంలో జంబూ నేరేడు చెట్ల పెంపకం తక్కువేనని చెప్పాలి.

జంబూ నేరేడు చెట్లు సంవత్సరానికి ఒకేసారి పళ్లనిస్తాయి. నవంబర్ నెలలో పూత ప్రారంభమై మార్చి - ఏప్రిల్ నాటికి పళ్లు తయారవుతాయి. మే- జూన్ నెలల వరకూ కాయలు కాస్తూనే ఉంటాయి.

జంబూ నేరేడు మొక్క నాటిన మూడు సంవత్సరాలకు చెటుగా మారుతుంది. ఆ తర్వాత చెట్టుకు కాయలు కాస్తూనే ఉంటాయి. ప్రతి చెట్టూ 30-35 ఏళ్ల వరకు పళ్లనిస్తుంది.

-యం.కె

## అవిటి వారికి కోతి ఊతల

**అ**విటితనంతో బాధపడే మానవులలో ఆత్మస్థయిర్యం పెంచి వారి పనులలో సహాయకారిగా ఉండేందుకుగాను కోతులకు శిక్షణ ఇస్తున్నారు.

కొన్ని నెలల శిక్షణలోనే రెండు కోతులు అద్భుతమైన ఫలితాలు ఇచ్చాయి. తాళాలు, బట్టలు వెదకి అందించటం, లైట్లు వెలిగించడం, తీయడం, చేతులు లేని వారికి స్పూన్‌తో ఆహారాన్ని నోటికి అందించటం, చివరకు తలుపులు తీయడం వంటి పనులు చేస్తూ అవిటి మానవులకు ఎంతో సహాయకారిగా మారాయి.

గుడ్డి వారికి దారి చూపే మార్గదర్శకమైన కుక్కలకంటే అవిటి వారికి చేయూతనందించే ఈ చిట్టి చేతుల సహాయం అనల్పమని అమెరికాలోని టఫ్ట్ న్యూ ఇంగ్లండ్ మెడికల్ సెంటరులోని పరిశోధకులు భావిస్తున్నారు. అమెరికాలో చేతులు, కాళ్ళు లేని 38 వేల మందికి దక్షిణ అమెరికాకు చెందిన కోతులు ఎంతో మేలు చేయగలవని వారు ఆశిస్తున్నారు.

మూడు సంవత్సరాల వయసు గల టిప్, క్రిస్టల్‌లకు మరికొన్ని పనులలో శిక్షణ ఇచ్చి వాటిని అవిటివారైన ఇద్దరికి అప్పగించనున్నట్లు వారు తెలిపారు. "టిప్ను ఆమె యజమానితో బజారు వెళ్ళి సరుకులు తెమ్మంటే కావాల్సిన వస్తువులను వీల్ ఛైర్ వెనుక గల సంచిలో వేసి తీసుకురాగలదు కూడా" అన్నారు.

క్రిస్టల్‌కు లిఫ్ట్‌ను పనిచేయించటంలో శిక్షణ ఇస్తున్నారు. అంతేగాక ఫ్రిజ్‌లోంచి శాండ్‌విచెస్ తెచ్చి నోటికి అందించగలదని, రికార్డులు మార్చగలదని వారు తెలిపారు.

ఒక ఏడాది వయసున్న హెల్లియన్, మోరాలకు సైతం పై పనులన్నిటిలో శిక్షణ ఇచ్చి వాటిని అంగవికలురైన వారికి అప్పగించనున్నట్లు పరిశోధకులు తెలిపారు.

**-అట్లూరి శరత్‌బాబు**